
కథ

# తప్పెవరిది?

ప్రేమ



ఆఫీసు అవర్స్ ముగుస్తుండగా "సార్, మీకు ఫోన్!" అంటూ అటెండర్ చెప్పేసరికి వెళ్లి రిసీవర్ చేతిలోకి తీసుకున్నాను.

కంగారేమీ లేదు, అటువైపు శివరాం అని విని ఊపిరి పీల్చుకునేంతలోనే బాంబులాంటి వార్త పేల్చాడు వాడు. రిసీవర్ జారిపోలేదు గానీ, అంత పనీ అయింది. స్థితప్రజ్ఞుడినని మిత్రులిచ్చే సర్టిఫికెట్ ఉన్నా ఆ క్షణం నా ఒళ్లు కంపించింది.

ఆఫీసుకు ఇంకా అరగంట సమయం ఉండడంతో మేనేజర్‌కు చెప్పటానికి అటువైపు కదిలాను. నా ఆత్రుత గమనించి విషయమేమిటని అడిగినా, నిజం చెప్పలేక అసలు 'అది' ఎలా చెప్పాలో తెలియక చిన్న అబద్ధం చెప్పేసి బయటపడ్డాను.

హడావుడిగా స్కూటర్ తీసుకుని మేము ఎప్పుడూ కలుసుకునే పర్మనెంట్ కేరాఫ్ అడ్రస్ శివాజీ కేఫ్‌వైపు కదిలాను. ఈ సందర్భంగా ఆ కేఫ్ గురించి చెప్పటం అసందర్భం, అనవసర ప్రసంగం అయినా చెప్పక తప్పదు.

దానికీ, మా మిత్రబృందానికీ అవినాభావ సంబంధముంది. మాకు పెళ్లిళ్లు కాకముందునుంచీ.. ఎవరు ఎవరికి అపాయింట్‌మెంట్‌లాంటిది ఇవ్వాల్సివచ్చినా, అదే కలుసుకోవాలన్నా.. 'సాయంత్రం ఐదు గంటలకి శివాజీ కేఫ్ దగ్గరకి రా!' అనటం ఆనవాయితీ అయింది. అది తెలిసిన కొంతమంది అపాయింట్‌మెంట్ అక్కర్లేకుండానే సదరు ఆ సమయానికి అక్కడికొస్తే దొరికిపోయేవాళ్లం... అప్పులవాళ్లకు కూడా. మాకది ఒక మీటింగ్ ప్లేస్‌లా బాగా ఉపయోగపడేది.

శ్రీనుగాడు ప్రేమించిన అమ్మాయి, వాడికి 'హ్యాండ్' ఇచ్చి మరొకర్ని చేసుకున్నప్పుడు గానీ, ఎన్నో కష్టాల్లో ఉన్న ప్రసాద్‌కు ఉద్యోగమొచ్చినప్పుడు గానీ మా సుఖసంతోషాలకు గానీ ఆ కేఫే సాక్షి. కొత్తగా వచ్చి నాలుగురోజులుండి వెళ్లేవాళ్లు తప్ప పర్మనెంట్‌గా అక్కడ పనిచేసేవారు కూడా మా కెప్పుడూ అసౌకర్యం కల్పించేవాళ్లు కాదు. పైగా మేము అడిగినప్పుడే టీలూ గట్రా తెచ్చేవాళ్లు. అప్పటిదాకా సుబ్బరంగా ఫాను కూడా వేసి మా మానాన మమ్మల్ని వదిలేసేవాళ్లు. ఓనర్ కూడా మనసులో

ఏమనుకునేవాడో తెలియదు గానీ, మేం వెళ్లగానే "రండి, సార్!" అంటూ గారపట్టిన పళ్లు ఇంతలా తెరిచి నవ్వుతూ ఆహ్వానించేవాడు.

ఇంతా చేస్తే పొద్దంతా బాతాఖానీ వేస్తూ మేము చేసే బిల్లు పది రూపాయలకు మించేది కాదు. మహా అయితే నాలుగు టీలు, మూడు బిస్కెట్లు.

ఇక సదరు శివరాం గాడి విషయానికి వస్తే, వాడు నాకు చిరకాల మిత్రుడు! వాడు ఎంత మంచి మిత్రుడంటే, వాడి పరోక్షంలో కూడా 'స్నేహితుడంటే ఇలా ఉండాలి' అని నేను అనుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

నాకంటే ఒక సంవత్సరం చిన్నవాడే. నాకంటే కాస్త ముందే శివారం పెళ్లి జరిగింది. వాడు పెళ్లికి ముందు ఎంతో బావుండేవాడు. ఇప్పుడు లేడని కాదు కానీ, వయసు ప్రభావాన్ని దాచలేం కదా! ఏమైనా వాడికి గ్లామర్ పుట్టుకతో వచ్చిన వరం. సహజంగా కాస్తంత కళాదృష్టి, కవితలల్లే దృష్టి ఉన్నవాడవటంచేత పెళ్లంటూ చేసుకుంటే సినిమా హీరోయిన్ అబ్బలాంటి అమ్మాయిని చేసుకోవాలని వాడి కోరికగా ఉండేది. అది తరచూ వ్యక్తం చేసేవాడు కూడా. తండ్రి చిన్నప్పుడే పోవటంతో ఎంతో కష్టపడి పెంచి పెద్దచేసిన శివారం తల్లి వాడికి ఎక్కడెక్కడో సంబంధాలు వెతికి వెళ్లి చూసొద్దామని పోరు పెట్టేది. వాడు ఆ అడ్రస్‌లు మాత్రం తీసుకుని నా దగ్గరకి రావటం, ఇద్దరం కలిసి వెళ్లి చూసి రావటం చాలాసార్లు జరిగింది. ఒకవిధంగా చెప్పాలంటే వాడి వ్యక్తిగత విషయాల్లో వాడి నిర్ణయం మీదకంటే నా మీదే ఎక్కువగా ఆధారపడేవాడు. అలా ప్రతి చిన్న సమస్యను నా మీదే వేయటం నాకు ఒకింత విసుగ్గా అనిపించినా నాపై వాడికున్న నమ్మకానికి గర్వంగా కూడా అనిపించేది. వాడి టేస్టు తెలిసి నేనే కొన్ని సంబంధాల్ని తిరస్కరించగా మరికొన్ని సంబంధాలు నేను సరేనన్నా వాడు ఒప్పుకునేవాడు కాదు. అలాంటి సందర్భాల్లో కాసింత అసహనంతో నేను కేకలేసినా వాడు మౌనంగా భరించేవాడు గానీ, 'అందం' మీద తనకున్న అభిప్రాయాన్ని మాత్రం మార్చుకునేవాడు కాదు.

అలా రెండేళ్లు గడిచిపోయాయి.

ఈలోగా నాకు మా మేనమామ కూతురితో నిశ్చితార్థం జరగటం, ఒక ప్రముఖ కంపెనీలో ఉద్యోగానికి ట్రైనింగ్‌కోసం బెంగుళూరు వెళ్లటం జరిగిపోయాయి. నేను అక్కడ ఉండగానే ఒకరోజు సడెన్‌గా పోస్టులో వచ్చిన వాడి పెళ్లి శుభలేఖ చూసి ఆశ్చర్యపోయాను. ఎందుకో నాకే ఒక బరువు దిగిపోయినట్టనిపించింది. ఇంత హడావుడిగా ముహూర్తాలు పెట్టుకున్నారంటే బహుశా వాడి ఊహాసుందరి దొరికి ఉంటుందనుకున్నాను. వధువు పేరుకోసం వెతికాను... ప్రణీత. నా ఊహ కరెక్టే అనిపించింది. మళ్లీ పేరునుబట్టి మనిషి అందంగా ఉందో లేదో తీర్మానించేసిన నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది.

ప్రణీత, కస్తూరి, సౌజన్య... ఇలాంటి అందమైన పేర్లున్నవాళ్లు ఖచ్చితంగా అందగత్తెలే అయి ఉండాలని రూలేమీ లేదు కదా! అలాగే 'అప్పలమ్మ' అని పేరు ఉండి కూడా అందంగా ఉండొచ్చు కదా. ఎవరైనా పొత్తిళ్లల్లో ఉన్న పసిగుడ్డుకు తమ అభిరుచి, అవగాహన మేరకు పేర్లు పెట్టుకుంటారు గానీ, ఆ పాప పెరిగి పెద్దదై అనాకారి అవుతుందో అందగత్తె అవుతుందో ఎవరు చెప్పగలరు? (కొందర్ని మినహాయించి)


ట్రైనింగ్‌లో స్ట్రిక్ట్ రూల్స్ కారణంగా వాడి పెళ్లికి నేను వెళ్లలేకపోయినా, ఎలాగోలా పర్మిషన్ సంపాదించి రిసెప్షన్‌కు మాత్రం వెళ్లగలిగాను. నేను కనపడగానే వాడి కళ్లల్లో కనిపించిన కాంతిని నే నెప్పటికీ మర్చిపోలేను. పెళ్లికి రానందుకు వాడేమీ కోపగించుకోలేదు. నా ఇబ్బందిని వాడు అర్థం చేసుకోవటం నాకు సంతోషంగా అనిపించింది. ఆ క్షణంలో మూడో వ్యక్తి ఎవరైనా మా ఇద్దర్నీ చూస్తే ఎలాంటి అపార్థాలూ రాకుండా పదిహేనేళ్లుగా మేము ఎందుకు స్నేహితుల్లాగే ఉంటున్నామో తప్పకుండా అర్థమయ్యేది. నేను వారిస్తున్నా వినకుండా వాడు స్టేజీ దిగి నాకు ఎదురుగా వచ్చి కౌగలించుకోవడంతో నా కళ్లు చెమ్మగిల్లటం నేను దాచుకోలేకపోయాను.

"ప్రణీత" తల ఎత్తీ ఎత్తనట్టు మా ఇద్దర్నే గమనిస్తున్న కొత్త పెళ్లికూతుర్ని పరిచయం చేశాడు శివరాం.

అంతవరకూ స్నేహంలోని ఆప్యాయతానురాగాల్లో మునిగి తేలుతున్న నేను పెళ్లికూతుర్ని గమనించి ఒక్క క్షణం బెదిరిపోయినట్టు చూశాను. అయినా అంతలోనే తేరుకుని ప్రతి నమస్కారం చేశాను.

ప్రణీత పెద్ద అందగత్తేం కాదు. అలాగని అనాకారి కూడా కాదు. ఓ మోస్తరుగా ఉందంతే!

ఇంతకంటే అందగత్తెల్ని ఎంతోమందిని వాడు కావాల్సి తిరగొట్టడం నాకు తెలుసు. అయినా ఎందుకు రాజీపడ్డాడు? కట్నం కోసమా?



కాదు, అయి ఉండదు. నాకు తెలిసి అంత చీప్‌గా బిహేవ్ చేసే వ్యక్తిత్వం కాదు వాడిది.

ఆ తర్వాత శివరాం ఎప్పుడూ ప్రణీతను కష్టపెట్టినట్టు నా దృష్టికి రాలేదు. తను కోరుకున్నది దక్కకపోతే దక్కినదాన్నే కోరుకోవాలనే వేదాంతసూత్రం వాడు బాగా ఒంటబట్టించుకున్నాడని నేనూ అనుకున్నాను. ఈ నాలుగేళ్లల్లో బంగారంలాంటి ఇద్దరు పిల్లలకు తండ్రి అయ్యాడు శివరాం.

రోజులు దొర్లిపోయాయి.

నాకూ ఇద్దరు పిల్లలు.

మా ఇద్దరికీ పుట్టే పిల్లల ద్వారా వియ్యమందుకోవాలనే మా ఆలోచనని మరొకసారి వాడే గుర్తుచేశాడు. కులాల పట్టింపులు లేకుండా ఎవరేమనుకున్నా సరే అలాగే చేద్దామని చెప్పాను. అయినా దానికింకా చాలా సమయం ఉంది. నేనూ స్వంత ఊరికే ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. ఈలోగా వాడొక ఫర్నిచర్ షాప్ తెరిచాడు. వాడికున్న పరిచయాల మూలంగా తొందర్లోనే పుంజుకుంది వ్యాపారం. కస్టమర్లని మభ్యపెట్టే స్కీమ్లు, బహుమతులు ఏవీ లేకుండానే క్వాలిటీ, నిజాయితీ అనే ప్రాతిపదికనే వాడి వ్యాపారం పెరిగింది. నేను కూడా యథాశక్తి నాకు

తమకున్న
స్తోమతకు
రాకుమారుడిలాంటివాణ్ణి
తెచ్చి పెళ్లి చేస్తారనుకున్న శైలజకు
తమ కుటుంబానికి బాగా
కావాల్సినవాళ్లవటంచేత ఆ
ఇంట్లో పడక తప్పలేదు.
మనసులోని కోరికల్ని
అణచిపెట్టుకోలేక, అలాగని
బయటపెట్టలేక
మధనపడుతూనే ఒక
బిడ్డకు తల్లి అయింది శైలజ.

తెలిసినవాళ్లని, మా ఆఫీసులో సగంమందిని వాడి కష్టమర్లని చేశాను.

తను పెళ్లి చేసుకుని తనదారి తను చూసుకోకుండా తండ్రి లేని కుటుంబానికి పెద్దగా తమ్ముడ్ని బిడ్డలాగా పెంచి ప్రయోజకుణ్ణి చేశాడు శివరాం. దగ్గరి బంధువులేదో సంబంధం తీసుకొస్తే అన్నీ కలిసిరావడంతో ముహూర్తాలు పెట్టుకున్నారు.

అప్పుడు ప్రవేశించింది వాడి జీవితంలోకి శైలజ.

శివరాం తమ్ముడి భార్య తరఫు చుట్టంగా వాడికి పరిచయమైన శైలజ వాడి జీవితాన్నే ఒక కుదుపు కుదుపుతుందని బహుశా వాడు ఊహించి ఉండడు. ఆమె కూడా పెళ్లీ అదీ కాని పదహారేళ్ల పడుచేం కాదు. ఇరవైకి దూరంగా పాతిక్కి దగ్గరైన ఒక బిడ్డ తల్లి. కాకపోతే అలా కనిపించదు. కండపట్టి ఉన్న ఒళ్లు. తీర్చిదిద్దినట్టున్న అవయవ సౌష్టవం ... వెరసి ఆమెను అందగత్తె అనవచ్చు.

ఎంత దాచుకున్నా లోలోపల ఏదో అసంతృప్తితో దహించుకుపోతున్నట్టుగా ఆమె కళ్లు ఎప్పుడూ అరమోడ్పుగా దేనికోసమో వెతుకుతున్నట్టుగా ఉండటం నేను కూడా గమనించాను. కానీ సభ్యత కాదని పట్టించుకోలేదు. ఆమె సిటీకి దగ్గర్లో ఒక మారుమూల పల్లెలో ఉన్న భూస్వామి ముద్దులబిడ్డ. ఇంటర్ వరకూ చదువుకుందని విన్నాను. శివరామ్‌కి మల్లే పెళ్లికి ముందే ఏవేవో కోరికలు, ఊహల్లో ఉన్న శైలజను ఆమె ఊహలతో పనిలేదన్నట్లుగా పొరుగూర్లో ఉన్న ఒక స్థితిమంతుడికిచ్చి పెళ్లి చేశారు. భర్త చూస్తే అనాకారి అని చెప్పవచ్చు. కాకిముక్కుకు దొండపండులాగే ఉంటాడు.

తను పదవతరగతి గట్టెక్కలేక, ఇక ఆ అవసరం కూడా లేదనేమో తమకున్న వ్యవసాయం చూసుకోవటం మొదలెట్టాడు.

తమకున్న స్తోమతకు రాకుమారుడిలాంటివాణ్ణే తెచ్చి పెళ్లి చేస్తారనుకున్న శైలజకు తమ కుటుంబానికి బాగా కావాల్సినవాళ్లవటంచేత ఆ ఇంట్లో పడక తప్పలేదు. మనసులోని కోరికల్ని అణచిపెట్టుకోలేక, అలాగని బయటపెట్టలేక మథనపడుతూనే ఒక బిడ్డకు తల్లి అయింది శైలజ. ఆమె భర్త కూడా ఎప్పుడూ వ్యవసాయ పనుల్లో మునిగి తేలటం, భార్య మనసులోని కోరికల్ని గుర్తించలేకపోవడంతో వారిద్దరి మధ్యా దగ్గరితనం దూరం కావటం మొదలుపెట్టింది.

సరిగ్గా అదే సమయంలో ఆమెకు పరిచయమయ్యాడు శివరాం.


వాడూ మొదట్లో ఆమెను పట్టించుకోలేదు.

కానీ సైన్స్ ధర్మం ప్రకారం ఒకే జాతి ధ్రువాలు వికర్షించుకుంటే శరీర ధర్మం ప్రకారం ఆకర్షించుకుంటాయనే సత్యం క్రమంగా ఇద్దరికీ అర్థమవసాగింది.

ఫలితం ...

ఆమె బంధువుల పేరు చెప్పి సిటీకి రావడం, వీడు వ్యాపారం పేరుతో ఎక్కువ సమయం బయటే గడపటం మొదలయింది. ఒక్కసారిగా కోల్పోయిందేదో దొరికినట్టు ఇద్దరూ కొన్నిరోజులు అదే లోకంలో పడి తిరిగారు.

వాడికి సంబంధించిన ఏ విషయమైనా నాకు చెప్పేదాకా నిద్రపోనివాడు ఎందుకో ఈ విషయాన్ని మాత్రం నా దగ్గర చాలా రోజులు దాచిపెట్టాడు. నాకు చూచాయగా తెలిసినా




తెలియనట్టే ఉన్నాను. అప్పటికే ఊరూ వాడా చెవులు కొరుక్కోవటం కూడా మొదలయింది.

ఒకరోజు వాడు ఎన్నడూ లేనంత టెన్షన్‌గా ఉండటం చూసి కావాలనే కదిలించాను ఏం జరిగిందని.

"నన్ను, క్షమించరా!" అన్నాడు శివరాం.

"సరే, ఏం జరిగిందో చెప్పు!" అన్నాను.

శివరాంతో పరిచయమైన ఆరునెలల్లోనే శైలజకు ఒక కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్టై దాన్ని శాశ్వతం చేసుకోవటానికి భర్తకు విడాకులివ్వటానికి సిద్ధపడిందని చెప్పాడు. శివరాం ఒప్పుకుంటే విడాకులతోపాటు కొంత డబ్బు, నగలతో వచ్చేస్తానని తేల్చి చెప్పేసిందట కూడా. అందరూ అంగీకరిస్తే రెండో భార్యగా, లేదంటే ఉంపుడుగత్తెగానైనా ఉండటానికి సిద్ధంగా ఉన్నానందట. వాడేమో ఇటు భార్యకు అన్యాయం చేయలేక, అటు ఆవిడకు ఏం చెప్పాలో తెలియక నా మీద భారం వేసి ఊపిరి పీల్చుకున్నాడు. కానీ నాకు ఊపిరి తీయటం కష్టంగా అనిపించింది కొంతసేపు. పైగా వారం రోజుల్లో ఏ విషయం తేల్చి చెప్పకపోతే ఆత్మహత్య చేసుకుంటానని కూడా అల్టిమేటమ్ ఇచ్చిందట.

నాకు మాత్రం ధర్మసంకటమే అనిపించింది.

శైలజ చెప్పినట్టే చేయమని ఆ అనైతిక సంబంధానికి మద్దతు పలకటమా?

ఇంతటితో ఈ సంబంధానికి ఫుల్‌స్టాప్ పెట్టి మర్చిపొమ్మనటమా?

అలా చేస్తే ఆమె బెదిరింపొకటి ముందు రెడ్ సిగ్నల్‌గా కనిపిస్తోంది.

అయినా వెధవ, చేసేదంతా చేసి ఇప్పుడు నా మీద పడితే నేనేం చేయగలను?

నా అంతరాత్మ ఘోషిస్తోంది...

అయినా తప్పదు ...

ఈ పరిస్థితిలో నేను కోపగించుకోవటం కూడా భావ్యం కాదని ఊరుకున్నాను. వాడు చూస్తే పూర్తిగా నేను చెప్పే తీర్పుకోసమే ఎదురు చూస్తున్నట్టుగా ఉన్నాడు. పైగా వాడి శ్రేయస్సు కోరుకోవటం మిత్రుడిగా నా ధర్మం కూడాను.

కాసేపు నాకున్న సామాజిక, చట్టపరమైన అవగాహనంతా ఒకచోటుకి చేర్చి సుదీర్ఘమైన రెండు పేజీల ఉపన్యాసం తయారుచేసి వాడికి వినిపించాను.

మొదటిది ఆమె దగ్గరకెళ్లి "జరిగిందేదో జరిగింది, ఇక నన్ను మర్చిపోయి నీ భర్తతో కాపురం చేసుకో!" అని చెప్పటం.

రెండోది ఆమె చచ్చిపోతానని బెదిరిస్తే చావమని మొహంమీదే చెప్పటం. ఇలా కటువుగా మాట్లాడితే టోటల్‌గా ఆమె శివరాంని మర్చిపోతుందనేది నా ఉపన్యాస సారాంశం.

తద్వారా రెండు కాపురాలూ బాగుపడతాయని అనుకున్నాను.

కానీ జరిగింది వేరు. వాడు అలా చెప్పిన రెండో రోజే ఆమె ఇంట్లోని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది...ట.

అందుకే వాడు అర్జెంటుగా రమ్మని ఫోన్ చేశాడు.

***

స్కూటర్ శివాజీ కేఫ్ ముందు పార్క్ చేశాను.

తప్పొప్పులు బేరీజు వేయటానికి వాడక్కడ సిద్ధంగా ఉన్నాడు.

కానీ అంతకు ముందే నేను మిమ్మల్ని అడుగుతున్నాను. మీరే చెప్పండి, ఈ తప్పెవరిది? ■